సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024





విద్యుత్ వెలుగుల్లో యుద్ధ నౌకలు

సాగరం.. సాహసం..

ఉత్కంఠభరితంగా నేవీ సన్నాహక విన్యాసాలు

రణరంగంలా మారిన ఆర్.కె.బీచ్





సీ క్యాడెట్ కార్ప్స్ నృత్యాలు

సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగనతలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రుమూకలపై మార్కోస్ ఉప్పెనలా దాడి.. దూసుకొచ్చిన మిసైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. మొత్తంగా ఆర్.కె.బీచ్ రణరంగాన్ని తలపించింది. ఉత్కంఠభరితంగా సాగిన నేవీ రిహార్సల్స్.. ఉవ్వెత్తున ఎగిసిపడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. జనవరి 4న జరిగే నేవీ విన్యాసాల్లో భాగంగా శనివారం జరిగిన రిహార్సల్స్ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. విన్యాసాల్లో చేతక్ హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు, సబ్‌మెరైన్‌లు, మెరైన్ కమాండోల విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మెరైన్ కమాండోలు తాడు సహాయంతో హెలికాప్టర్ నుంచి దిగి.. శత్రువులను ఓడించే నమూనా ప్రదర్శన చూపించారు. పారాచూట్‌లతో దిగిన నావికా సిబ్బంది ప్రత్యేక జ్ఞాపికను అతిథికి అందజేశారు. యుద్ధ నౌకలపై హెలికాప్టర్ల ల్యాండింగ్, హాక్ యుద్ధ విమానాల విన్యాసాలు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల ప్రదర్శన ఆకట్టుకుంది. సీ క్యాడెట్ కార్ప్స్ విద్యార్థుల నృత్య ప్రదర్శన క్రమశిక్షణకు అద్దం పట్టింది. యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ ఫైరింగ్, వార్‌షిప్‌ల కాల్పులు ఉత్కంఠను రేపాయి. చేతక్, సీ కింగ్, డార్నియర్ హెలికాప్టర్లు, హాక్ జెట్ ఫైటర్ల విన్యాసాలు అలరించాయి. చివర్లో నావికాదళ వాద్య బృందం బీటింగ్ రిట్రీట్, నౌకలపై విద్యుత్ దీపాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విన్యాసాల్లో పాల్గొన్న నావికాదళ సిబ్బంది ఆలివ్ గ్రీన్ దుస్తుల్లో కనిపించడం విశేషం. ఆదివారం, జనవరి 2వ తేదీన రిహార్సల్స్ ఉంటాయని నేవీ వర్గాలు తెలిపాయి. – ఏయూక్యాంపస్





దూసుకొస్తున్న యుద్ధ విమానాలు



మెరైన్ కమాండోల విన్యాసాలు



జయహో భారత్



మార్కోస్ టీం విన్యాసాలు

SUNDAY SPECIAL

గ్లోబల్ వార్మింగ్‌కు చెక్

విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని మరోసారి రుజువైంది. ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న గ్లోబల్ వార్మింగ్‌పై డిగ్రీ స్థాయిలోనే విస్తృత పరిశోధనలు చేసి, కార్బన్ డయాక్సైడ్ శాతాన్ని తగ్గించేందుకు పరిష్కారం కనుగొన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల లైఫ్ సైన్సెస్ విద్యార్థులు చేసిన ఈ పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది.
- సీతంపేట

CO_2 తగ్గించే సముద్రపు గడ్డి

- అంతర్జాతీయ వేదికపై 'బుల్లయ్య'విద్యార్థుల సత్తా
- గ్లోబల్ వార్మింగ్ తగ్గించే పరిశోధనలో విజయం
- ఫెలోషిప్‌కు అమెరికా వెళ్లనున్న బృందం



పరిశోధనలో విజయం సాధించిన విద్యార్థి బృందం

కళాశాలలో బీఎస్సీ లైఫ్ సైన్సెస్(బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ) ఆఖరి సంవత్సరం చదువుతున్న టి.హర్షిత, ఎ.తేజాంబిక్, జె.కార్తికేయ, ఎం.అశ్విని విశాఖ సముద్ర తీరంలో సముద్రపు గడ్డి పచ్చిక భూములను పునరుద్ధరించే 'బ్లూ కార్బన్ ఎకో సిస్టమ్ పయనీరింగ్' అనే అంశంపై పరిశోధన చేశారు. వీరికి పర్యావరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మాధవి, జువాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శైలజ మార్గదర్శకులుగా నిలిచారు. స్టూడెంట్ సొసైటీ ఫర్ క్లైమేట్ చేంజ్ అవేర్‌నెస్(ఎస్ఎస్‌సీసీఏ), సీడ్స్ ఆఫ్ పీస్(యూఎస్‌పీ) సంస్థలు సంయుక్తంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీలో 33 బృందాలు పాల్గొనగా, క్లైమేట్ ట్యాంక్ యాక్సిలరేటర్ విభాగంలో వీరు ప్రథమ స్థానంలో నిలిచారు. వెయ్యి డాలర్లను గెలుపొందడమే కాకుండా, ప్రాజెక్టు తదుపరి అధ్యయనాల కోసం 2025 ఫిబ్రవరి 12న ఫెలోషిప్ ప్రోగ్రాంకు అమెరికా వెళ్లనున్నారు.

పరిశోధన సాగిందిలా..

పర్యావరణానికి సంబంధించిన ఆరు అంశాలపై పరిశోధనలు చేయడానికి హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఎస్ఎస్‌సీసీఏ, న్యూయార్క్‌కు చెందిన సీడ్స్ ఆఫ్ పీస్ సంస్థలు విద్యార్థులకు అవకాశం కల్పించాయి. బుల్లయ్య కళాశాల విద్యార్థులు వాతావరణానికి సంబంధించిన అంశం(గ్లోబల్ వార్మింగ్)ను ఎంపిక చేసుకున్నారు. ఈ విధంగా దేశంలోని వివిధ కళాశాలల నుంచి 33 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ పోటీలో బుల్లయ్య కళాశాల నుంచి మూడు జట్లు పాల్గొనగా.. డిగ్రీ(బయోటెక్నాలజీ) ఫైనలియర్ చదువుతున్న నలుగురు విద్యార్థుల బృందం ఈ పోటీల్లో విజేతగా నిలిచింది. వీరికి అసిస్టెంట్ ప్రొఫెసర్లు మార్గనిర్దేశం చేయగా.. మూడు దశల్లో పరిశోధన జరిగింది. మొదటి దశలో ఎంపిక చేసుకున్న అంశంపై పరిశోధన ఎలా చేయాలన్న విషయంపై అవగాహన కల్పించారు. రెండవ దశలో డిస్క్రిప్టివ్ ఐడియాను సిద్ధం చేశారు. పరిశోధన నిమిత్తం సీడ్స్ సంస్థ 200 డాలర్లు అందజేసింది. మొదటి, రెండు దశలు పూర్తయిన తర్వాత పరిశోధనకు వాస్తవ రూపం కల్పించారు.

- గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడానికి విద్యార్థులు ఎన్నో పరిశోధన పత్రాలు చదివి ఒక నిర్ణయానికి వచ్చారు. విశాఖ సముద్రతీరంలో అంతరించిపోయిన రెండు గడ్డి జాతి మొక్కలను మరలా ఇక్కడ పునరుద్ధరించి తద్వారా కార్బన్ డయాక్సైడ్(CO_2) శాతాన్ని తగ్గించేలా నమూనాలు తయారు చేశారు. ఒడిశాలోని చిలికా సరస్సు నుంచి 'హాలోఫిలా ఓవాలిస్, హాలోడ్యూల్ పీనిఫోలియా' అనే రెండు గడ్డి జాతి మొక్కలను తీసుకొచ్చారు. సాధారణ మొక్కల కంటే 33 శాతం అధికంగా వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకోవడం వీటి ప్రత్యేకత. ఈ గడ్డి మొక్కలను కళాశాల ల్యాబ్‌లో పెరిగేలా సముద్ర వాతావరణాన్ని కల్పించారు. ఇందుకోసం కోసం చెక్కతో తయారు చేసిన ట్రేలలో కొబ్బరి పీచు, సముద్రం నీరు, ఇసుక, గడ్డి ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. అవి జీవించడం మొదలుపెట్టాక స్కూబా డైవర్ల సహాయంతో మంగమారిపేట బీచ్‌లో ఎనిమిది మీటర్ల లోతులో నాటారు.



కళాశాల ల్యాబ్‌లో పెంచిన గడ్డి మొక్కలు

నజరానా 1000 డాలర్లు

డిసెంబర్ 12న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో విద్యార్థులు తీర్చిదిద్దిన ప్రాజెక్ట్‌లను యూఎస్ కాన్సులేట్ నుంచి వచ్చిన న్యాయనిర్ణేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా బుల్లయ్య విద్యార్థులు తమ ప్రాజెక్టు పని చేసే విధానాన్ని వారికి వివరించారు. ఈ పోటీలో పాల్గొన్న 33 జట్లలో తుది దశకు 8 జట్లు చేరుకోగా.. బుల్లయ్య విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి వెయ్యి డాలర్ల బహుమతి అందుకున్నారు. పరిశోధనలో పాల్గొన్న విద్యార్థులు, వారికి మార్గదర్శకత్వం వహించిన ప్రొఫెసర్లను ఫెలోషిప్ కోసం ఫిబ్రవరి 12న సీడ్స్ సంస్థ యూఎస్ తీసుకెళ్లనుంది.



మంగమారిపేట బీచ్‌లో మొక్కలు నాటుతున్న స్కూబా డైవర్

యాజమాన్యానికి ధన్యవాదాలు

వాతావరణంలోని వేడిని తగ్గించడం ఈ పరిశోధన ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. సవాలుగా తీసుకుని తక్కువ సమయంలో ప్రాజెక్టును పూర్తి చేయగలిగాం. పరిశోధనకు అవసరమైన ల్యాబ్, ఇతర సదుపాయాలను కళాశాల యాజమాన్యం కల్పించింది. కరస్పాండెంట్ మధుకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాధవి, శైలజ, ప్రిన్సిపాల్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ మేడమ్ సహకరించారు.
–టి.హర్షిత, ఫైనలియర్, బయోటెక్నాలజీ విద్యార్థిని

విస్తృతంగా మొక్కలు నాటాలి

గ్లోబల్ వార్మింగ్ తగ్గించడానికి ఈ రెండు గడ్డి జాతి మొక్కలను విశాలమైన తీర ప్రాంతంలో విస్తృతంగా నాటాలి. ప్రభుత్వం గానీ, జీవీఎంసీ, పోర్టు, వీఎంఆర్డీఏ వంటి సంస్థలు గానీ చొరవ తీసుకుని తీరంలో ఈ మొక్కలను పెద్ద సంఖ్యలో నాటితే భవిష్యత్‌లో చాలా మేలు జరుగుతుంది. ఈ మొక్కలు ఆక్వాటిక్ ప్లాంట్స్, చేపలు, తాబేళ్ల వంటి జలచరాల అభివృద్ధికి కూడా తోడ్పడతాయి.
– ఎ.తేజాంబిక్, ఫైనలియర్ విద్యార్థి



యూఎస్ కాన్సులేట్, సీడ్స్ ప్రతినిధుల నుంచి బహుమతులు అందుకున్న విద్యార్థులు(ఫైల్)

శభాష్ నితీశ్



విశాఖలో మిన్నంటిన సంబరాలు

విశాఖ స్పోర్ట్స్/అక్కిరెడ్డిపాలెం: బాక్సింగ్ డే టెస్ట్‌లో సెంచరీతో అదరగొట్టి మెల్‌బోర్న్ హీరోగా మారిన నితీశ్‌కుమార్ రెడ్డిపై ప్రశంసలు కురుస్తుండగా, విశాఖలో సంబరాలు అంబరాన్ని తాకాయి. భారత టాపార్డర్ ఆసీస్ బౌలర్లను ఎదుర్కొనలేక చేతులెత్తేసిన తరుణంలో నితీశ్ ఒత్తిడిని తట్టుకుని చేసిన అసమాన పోరాటం చాలా కాలం గుర్తుండిపోతుందని చెబుతూ.. పలువురు అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. 8వ నంబర్ బ్యాటర్‌గా వచ్చి తొలి సెంచరీ చేయడంతో శనివారం జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని ఆయన నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. నితీశ్ నాన్నమ్మ అప్పల కొండమ్మ, బాబాయిలు కాకి గోవిందరెడ్డి, కాకి రామిరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు కేక్ కట్ చేశారు. ఇంటి వద్ద బాణసంచా కాల్చుతూ, తీన్‌మార్ డ్యాన్స్‌లతో సంబరాలు చేసుకున్నారు. భారత క్రికెట్ జట్టుకు తమ గ్రామానికి చెందిన నితీశ్ ఆడుతుండటం తమకెంతో ఆనందంగా ఉందని గ్రామస్తు లు తెలిపారు.

ప్రస్తుతం నితీశ్ నివాసం ఉంటున్న కొమ్మాదిలోని అపార్ట్‌మెంట్ వద్ద కూడా కోలాహలం నెలకొంది. అపార్ట్‌మెంట్ వాసులు నితీశ్ ఆటను పూర్తిగా ఆస్వాదించారు. అతను సెంచరీ చేసిన దృశ్యాలను టీవీల్లో వీక్షిస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ కమిటీ ప్రతినిధి వి.వి.రావు 'సాక్షి'తో మాట్లాడుతూ.. నితీశ్ తక్కువ సమయంలోనే అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడని సంతోషం వ్యక్తం చేశారు. రెండేళ్ల కిందటే వారు అపార్ట్‌మెంట్‌లోకి వచ్చారని తెలిపారు.

నితీశ్‌కు కలెక్టర్ అభినందనలు

మహారాణిపేట: మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఉత్తమ ఆటతీరు కనబరిచిన యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డిని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అభినందించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్న నితీశ్ ఆంధ్రప్రదేశ్‌కు, విశాఖపట్నానికి గర్వకారణమని కొనియాడారు. ఇదే ఒరవడి కొనసాగించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు నమోదు చేయాలని ఆకాంక్షించారు. తన ఆటతో విశాఖకు మంచి పేరు తీసుకొచ్చిన నితీశ్ కుమార్ రెడ్డికి జిల్లా యంత్రాంగం, ప్రజల తరఫున అభినందనలు తెలుపుతున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.



తుంగ్లాంలో కేక్ కట్ చేస్తున్న నితీశ్ నాన్నమ్మ అప్పల కొండమ్మ, కుటుంబ సభ్యులు



నితీశ్ సెంచరీ చేసిన సమయంలో చప్పట్లతో అభినందిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

గురిపెట్టాలి ఇలా..

అల్లిపురం: ఏటా నిర్వహించే వార్షిక ఫైరింగ్ ప్రాక్టీసులో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు. గ్రేహౌండ్స్‌లో శనివారం ఎస్ఐ స్థాయి నుంచి పై స్థాయి అధికారులకు నిర్వహించే ఫైరింగ్ ప్రాక్టీసును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఫైరింగ్ ప్రాక్టీస్ మెలకువలను సిబ్బందితో పంచుకున్నారు. ఏటా రెండు విడతలుగా ఫైరింగ్ ప్రాక్టీసులో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.



తుపాకీతో సీపీ

దేశం గొప్ప నేతను కోల్పోయింది

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి అర్పించిన బొత్స



మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న శాసనమండలి విపక్షనేత బొత్స, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు రవీంద్ర, రవిబాబు, పార్టీ ముఖ్య నేతలు

సాక్షి, విశాఖపట్నం: రాజకీయాలకు అతీతంగా దేశం కోసం పని చేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని.. ఆయన మరణం దేశానికి తీరని లోటని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. లాసన్స్‌బేకాలనీలోని తన కార్యాలయంలో శనివారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీతో కలిసి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని బొత్స కొనియాడారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్ రాజ్, తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, శోభా హైమావతి, సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు పేడాడ రమణికుమారి, చిన్న దాస్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, కెల్లా సునీత సత్యనారాయణ, లావణ్య నాగరాజు, బిపిన్ కుమార్ జైన్, చెన్నా జానకీరామ్, కోడి గుడ్ల పూర్ణిమ, అల్లు శంకరరావు, బర్కత్ అలీ, పీవీ సురేష్, నాయకులు షరీఫ్, బోని శివరామకృష్ణ, అల్లంపల్లి రాజబాబు, రామన్నపాత్రుడు, మారుతీ ప్రసాద్, తుల్లి చంద్ర శేఖర్, వాసపల్లి ఈశ్వరరావు, పెంటి అప్పన్న, జీలకర్ర నాగేంద్ర, మల్లేశ్వరి, దేవర కొండ మార్కేండేయులు, బి.పద్మావతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

- నగర మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్



ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ బ్యాగులు పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్, ప్రధాన వైద్యాధికారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో జనవరి ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల ప్రత్యామ్నాయాలు, ఇన్‌స్పెక్షన్ సిద్ధాంతాలపై స్కిల్ అప్ గ్రేడేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లు, శానిటరీ సూపర్ వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, స్ట్రీట్‌వెండర్స్, వర్తక వ్యాపారస్తులు, జోన్ల కార్యదర్శులతో జూమ్ యాప్ ద్వారా ప్లాస్టిక్ నిషేధంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుంచి తరిమి కొట్టాలని, ప్లాస్టిక్‌పై ఐదేళ్లుగా ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ జనవరి ఒకటి నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు 120 మైక్రాన్ల లోపు ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించనున్నామని, ఎవరైనా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వ్యాపారస్తునికి ఈ నెల 30లోగా నోటీసులు అందిస్తారన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించే చిన్న వ్యాపారస్తులకు మొదటిసారి రూ.2,500, రెండోసారి రూ.5 వేలతో పాటు వారి ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. అలాగే జీఎస్టీ పరిధిలోని పెద్ద వ్యాపారస్తులు మొదటిసారి రూ.20వేలు, రెండో సారి పట్టుబడితే రూ.40వేల అపరాధ రుసుంతో పాటు వారి లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై వినియోగంతో వస్తున్న వ్యాధులను కేజీహెచ్ చర్మ వ్యాధి వైద్యుడు ప్రొఫెసర్ రాజు, ఆంకాలజీ ప్రొఫెసర్ కుమారి వివరించారు. సెంటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ హెడ్ డాక్టర్ చంద్రశేఖర్ ప్లాస్టిక్ వస్తువుల్లో రకాలు, వాటి వల్ల కలిగే నష్టాలు, ప్లాస్టిక్ వస్తువులను గుర్తించే కోడ్‌లు, వాటి వివరాలు పీపీటీ ద్వారా వివరించారు.

రేపటి నుంచి సైన్స్ ఫెయిర్

విశాఖ విద్య: విద్యార్థులను సైన్స్ ఫెయిర్‌కు సిద్ధం చేయాలని డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ అన్నారు. తోటగరువు జెడ్పీ స్కూల్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న పాఠశాల స్థాయి, 31న మండల స్థాయి, జనవరి 3న జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తామన్నారు. డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఏడీ అరుణ జ్యోతి పాల్గొన్నారు.

ఢిల్లీ కేంద్రంగా విశాఖపై కుట్ర



జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా తరలివెళుతున్న సీపీఎం శ్రేణులు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

- మిట్టల్‌కు 'కూటమి' మద్దతా.?
- చంద్రబాబు నిజస్వరూపం బయటపడింది
- సీపీఎం జిల్లా మహాసభల్లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ధ్వజం

పెందుర్తి: 'ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం స్వరూపం బయట పడింది..ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చాక అతని అసలు నైజం స్పష్టమైంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాల్సిందిగా కోరకుండా.. మిట్టల్ కడుతున్న స్టీల్‌ప్లాంట్‌కు లైసెన్సులు ఇవ్వాలని అడగడం ఏంటి. మీరు మిట్టల్ కోసం గెలిచారా' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లా మహాసభలు శనివారం సుజాతనగర్‌లో ప్రారంభమయ్యాయి. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సుజాతనగర్‌లోని సభ ప్రాంగణం వరకు పార్టీ ముఖ్యనేతల సారథ్యంలో సీపీఎం భారీ ర్యాలీ చేపట్టింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ అభివృద్ధిపై ఢిల్లీ కేంద్రంగా కుట్రలు జరుగుతున్నాయని.. దానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలే వంత పాడుతున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్రకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రధాన నరేంద్రమోదీ గత పదేళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తామన్న రైల్వే జోన్‌కు కూడా అతీగతీ లేదన్నారు. ఏ హామీ నెరవేర్చకుండా జనవరి 8న విశాఖకు ఏ మొహం పెట్టుకుని ప్రధాని ఇక్కడకు వస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్రాన్ని సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్ పల్లకిలో మోయడం సిగ్గుచేటన్నారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను అనకాపల్లికి తేవడం వెనుక విశాఖ స్టీల్ ప్లాంట్‌ను శాశ్వతంగా మూసివేయాలన్న కుట్ర ఉందని స్పష్టం చేశారు. కర్నాటకలోని విశ్వేశ్వరయ్య స్టీల్ ప్లాంట్‌లో 243 మంది కార్మికులు పనిచేస్తే అక్కడి జనతాదళ్ సెక్యూలర్ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలు ద్వారా రూ.15 వేల కోట్లు కేంద్ర మంత్రి ఇచ్చారన్నారు. కానీ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 12 వేల మంది కార్మికులు ఉండి 7 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేస్తుంటే రాష్ట్ర ఎంపీలు ఒక్క పైసా కూడా తేలేకపోయారని మండిపడ్డారు. 'వీళ్లకు సిగ్గుందా.. ఢిల్లీకి వెళ్లడం ఎందుకు' అంటూ ధ్వజమెత్తారు. సీపీఎం రాష్ట్ర సీనియర్ నేత సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడే చరిత్ర సీపీఎంకే ఉందన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ విశాఖ ఉక్కుపై ఇచ్చిన హామీని నెరవేర్చలేదని..అతడికి ఎంపీగా కొనసాగే అర్హత లేదని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ మాట్లాడుతూ కార్పొరేట్ల మోసాలు, పాలకుల విధానాలపై ప్రజలకు నిజాలు చెప్పడమే సీపీఎం పని అని..ఆ నిజాలు ప్రజలకు అర్థం అయిన రోజు నుంచీ పాలకులు రోజులు లెక్కపెట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ ముఖ్య నేతలు డాక్టర్ బి.గంగారావ్, బి.పద్మ పలు అంశాలపై ప్రసంగించారు. పార్టీ నాయకులు వి.ఎస్ పద్మనాభరాజు, పి.వెంకటరెడ్డి, పైడిరాజు, తౌడన్న, కుమార్, బి.జగన్, బి.రమణి, బి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు బదిలీ!

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు బదిలీల ప్రక్రియ జరుగుతోంది. ఇక్కడ ఖైదీల సంఖ్య పెరిగిపోవడంతో జైల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ జైలు సామర్థ్యం 914 మంది కాగా.. ప్రస్తుతం 2,080 మంది ఖైదీలున్నారు. ఇందులో సుమారు 1200 మంది గంజాయి కేసుల్లో వచ్చినవారే ఉండటం విశేషం. సామర్థ్యం కంటే అదనంగా 1150 మంది ఖైదీలు జైలులో ఉన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సుమారు 200 మందికి పైగా ఖైదీలను రాజమండ్రి కేంద్ర కారాగారానికి తాత్కాలిక బదిలీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ఖైదీల సంఖ్య ఎక్కువైన సందర్భాల్లో వెసులుబాటులో భాగంగా జైల్ నిబంధనలు ప్రకారం ఖైదీలను బదిలీ చేయవచ్చన్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణ జరుగుతుందన్నారు. బదిలీలు జరగడానికి సుమారు రెండు నెలలు పడుతుందని తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మాయాదేవి మృతి



విశాఖ లీగల్: స్వాతంత్య్ర సమరయోధురాలు, ఎంఎల్‌బీటీ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యురాలు వి.ఆర్.మాయాదేవి (96) శనివారం తన కుమార్తె ఇంట్లో పరమపదించారు. మాయాదేవి తండ్రి దిగుమతి రామస్వామి, తల్లి జానకిబాయ్ కూడా స్వాతంత్ర సమరయోధులు. తమిళనాడులోని వేలూరు కారాగారంలో మాయాదేవి జన్మించారు. రెండేళ్ల క్రితం వరకు ఆమె విశాఖలోని గాయత్రీ విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలను స్వయంగా చూసుకునేవారు. వృద్ధాప్యం వల్ల కోల్‌కతాలో ఉంటున్న కుమార్తె దగ్గరకు వెళ్లారు. మాయాదేవికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతికి సంతాపంగా సోమవారం పాఠశాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు ఎంఎల్‌బీటీ ట్రస్ట్ అధ్యక్షురాలు వి.అంతర్వేది ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గాయత్రీ విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి ఇతర సభ్యులు, గాయత్రీ విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి తదితరులు సంతాపం తెలిపారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.77,840
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.71,350
వెండి(కిలో):	రూ.99,900

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.102
బ్రాయిలర్ (లైవ్)	: రూ.122
స్కిన్	: రూ.214
స్కిన్‌లెస్	: రూ.224

విశాఖలో ఈస్ట్‌కోస్ట్ జీఎం సుడిగాలి పర్యటన

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ విశాఖపట్నంలో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. విశాఖపట్నం, దువ్వాడ రైల్వే స్టేషన్లలో వాల్తేరు ఇన్‌చార్జ్ డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు, ఇతర అధికారులతో కలిసి రైల్వే సౌకర్యాలను సమగ్రంగా తనిఖీ చేశారు. ముందుగా.. విశాఖపట్నం రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. డీఆర్‌ఎం కాన్ఫరెన్స్ హాల్‌లో వాల్తేరు అధికారులతో సమావేశం నిర్వహించి, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. జ్ఞానాపురం వైపు జరుగుతున్న రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. గతిశక్తి ప్రాజెక్టుల అమలుపై అనుసరిస్తున్న వ్యూహాలపైనా సంబంధిత అధికారులతో జీఎం చర్చించారు. అనంతరం.. దువ్వాడ రైల్వే స్టేషన్‌కు చేరుకొని జనరల్ మేనేజర్ వెయిటింగ్ హాళ్లు, రైల్వే కార్యాలయాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, వాటర్ అవుట్‌లెట్లుతో పాటు అమృత్ భారత్ స్టేషన్ పనులను పరిశీలించారు. విశాఖపట్నం–గోపాలపట్నం, సింహాచలం నార్త్–దువ్వాడ, గేట్ జంక్షన్–వడ్లపూడి మధ్య మూడు, నాలుగో లైన్ పనుల పురోగతిని కూడా జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ పర్యవేక్షించారు.

సంక్రాంతి ప్రత్యేక సర్వీసులపై సమీక్ష

దాబాగార్డెన్స్: సంక్రాంతి పండగకు విశాఖ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడిపే విషయమై జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు శనివారం తన చాంబర్లో ఆర్టీసీ అధికారులతో భేటీ అయ్యారు. ఉత్తరాంధ్రకు 800 ట్రిప్పులు నడిపేందుకు ప్రణాళిక రూపొందించామని, అలాగే హైదరాబాద్, విజయవాడ, భీమవరం, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాలకు కూడా ప్రత్యేక సర్వీసులు ఏ విధంగా నడపాలన్న దానిపై చర్చించామన్నారు. సంక్రాంతి ప్రత్యేక సర్వీసులకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, వచ్చే నెల 10 నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్న దృష్ట్యా బస్సులు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని డిపో మేనేజర్లను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా డిపోల మేనేజర్లు గంగాధర్, అరుణ, ప్రవీణ, రాజశేఖర్, ఏటీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్న్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ నికర విలువ రూ. 267.19 కోట్లు

ఉక్కునగరం: ఉక్కు మంత్రిత్వశాఖ అడ్మినిస్ట్రేటివ్ నియంత్రణలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ అనుబంధ సంస్థ ఈస్టర్న్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (ఈఐఎల్) నికర విలువ రూ. 267.17 కోట్లు అని, 2023–24లో ఆ సంస్థ రూ. 2.10 లక్షలు నికర లాభం ఆర్జించిందని స్టీల్‌ప్లాంట్, ఈఐఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎ.కె.సక్సేనా తెలిపారు. శనివారం ఉక్కు పరిపాలన భవనంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈఐఎల్ 97వ వార్షిక సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో సక్సేనా మాట్లాడుతూ ఈఐఎల్ అనుబంధ సంస్థ ఒరిస్సా మినరల్స్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఓఎండీసీ) 2022–23లో రూ.16.54 కోట్లు నికర నష్టం సాధించగా 2023–24లో రూ. 2.82 కోట్లు నికర లాభం ఆర్జించిందన్నారు. మరో అనుబంధ సంస్థ బిస్రో స్టోన్ లైమ్ కంపెనీ లిమిటెడ్ (బీఎస్ఎల్‌సీ) 2022–23లో రూ.11.74 కోట్లు నికర లాభం సాధించగా, 2023–24లో రూ. 2.29 కోట్లు నికర లాభం ఆర్జించిందన్నారు. ఈ సంస్థల నిర్వహణలో సహకరిస్తున్న అన్ని సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉక్కు మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఈఐఎల్ ప్రభుత్వ డైరెక్టర్ స్వప్న భట్టాచార్య న్యూఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఈఐఎల్ ఎండీ ఎస్.సి.పాండే, ఈఐఎల్ కంపెనీ సెక్రటరీ ఎస్.రాజబాబు, ఏజీఎం కె.హేమరాజు పాల్గొన్నారు.

జైల్ వార్డర్ల కుటుంబీకుల ఆందోళన



సెంట్రల్ జైల్ ప్రధాన ద్వారం ముందు కూర్చొని నిరసన తెలుపుతున్న వార్డర్ల కుటుంబ సభ్యులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో పనిచేస్తున్న వార్డర్ల కుటుంబ సభ్యులు శనివారం ఆందోళనకు దిగారు. వార్డర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సాయంత్రం నుంచి జైల్ గేటు వద్దే పిల్లలతో కలిసి బైఠాయించారు. పలువురు జైల్ వార్డర్లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు వారాల కిందట కొత్తగా జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. ఆయన వచ్చినప్పటి నుంచి మూడు షిఫ్టుల్లో ఉన్న డ్యూటీని రెండు షిఫ్ట్‌లకు మార్చారు. ప్రతి రోజూ నిషేధిత వస్తువులు జైల్‌లోకి వెళ్లకుండా వార్డర్లను తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఓ బేరక్ వద్ద వార్డర్లు జయకృష్ణ, శంభునాయుడులను ఖైదీల ముందే దుస్తులు విప్పించి సూపరింటెండెంట్ తనిఖీ చేశారు. దానివల్ల అవమానం ఎదురైంది. ఆ ఇద్దరి తరఫున మరో వార్డర్ వాసుదేవరావు ఈ వ్యవహారం గురించి సూపరింటెండెంట్‌ను అడగడంతో ఆయనను సస్పెండ్ చేశారు. వాసుదేవరావు సస్పెన్షన్ ఎత్తేయాలని, పనివేళల్లో వెసులుబాటు కల్పించాలని కోరుతూ ఆందోళన చేపట్టినట్లు వార్డర్ల కుటుంబీకులు తెలిపారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న జైళ్ల శాఖ డీఐజీ రాజమహేంద్రవరం నుంచి సాయంత్రం బయలుదేరి విశాఖ వస్తున్నట్లు తెలిసింది.

వార్డర్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టాం : ఈ ఘటనపై జైల్ సూపరింటెండెంట్ మహేష్‌బాబు మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. జైల్ లోపలకు గంజాయి, బీడీలు తదితర నిషేధిత వస్తువులు తీసుకెళ్లడానికి వీలు లేకుండా చర్యలు చేపడుతున్నాం. శుక్రవారం సాయంత్రం ఖైదీలందరినీ బేరక్‌ల్లోకి పంపించిన అనంతరం ఓ గదిలో అనుమానం వచ్చినందుకు వార్డర్లు జయకృష్ణ, శంభునాయుడులను తనిఖీ చేశాం. ఖైదీల ముందు దుస్తులు విప్పించి తనిఖీ చేయించలేదు. దీనిపై వార్డర్ వాసుదేవరావు డిప్యూటీ సూపరింటెండెంట్‌పై అసభ్యకమైన పదజాలం వాడారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను ముందుగా డ్యూటీ స్థలం మార్చి మెయిన్ గేటు వద్ద వేశాం. అప్పటికీ ఆయన తీరు మారకపోవడంతో శనివారం సస్పెండ్ చేశామని సూపరింటెండెంట్ వివరించారు.

నేత్రపర్వంగా రథయాత్ర



కలశాలతో కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులు



కనులపండువగా సాగుతున్న రథయాత్ర

దాబాగార్డెన్స్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర శనివారం వైభవంగా సాగింది. అమ్మవారికి మాలధారణ చేసిన భక్తులు పూర్ణ కలశాలతో యాత్రలో పాల్గొన్నారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద సాయంత్రం 4 గంటలకు ఈ యాత్ర ప్రారంభమైంది. రథయాత్రను ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఈవో శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు ప్రారంభించగా.. జగదాంబ జంక్షన్, టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజ్ డౌన్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు సాగింది. విజయనగరం మహారాజ కళాశాల కళాకారుల పులివేషాలు, చెక్కభజన, కోలాటం, నవదుర్గల ప్రదర్శనలు రథయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు, మాలాధారణ చేసిన మాతలు, భక్తులతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది.

పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలే కీలకం

విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్



కమిటీలకు సూచనలిస్తున్న విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్

సింహాచలం: పాఠశాలల రక్షణ కవచం యాజమాన్య కమిటీలేనని విద్యాశాఖ ఆర్‌జేడీ బి.విజయభాస్కర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో పాఠశాలల యాజమాన్య కమిటీల శిక్షణ కార్యక్రమం శనివారం అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బడి, గుడికి ఎంతో విశిష్టత ఉన్నాయని, సమాన స్థాయిలో ఆరెండు ఆదరింపబడబడాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రతీ విద్యార్థికి అందేలా యాజమాన్య కమిటీలు కృషి చేయాలని సూచించారు. డ్రాప్ ఔట్‌లు లేకుండా చూడాలన్నారు. బాలికల సంరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలవుతున్న సంఘటనలు చూస్తున్నామని, ఉపాధ్యాయులతో పాటు కమిటీ సభ్యులు కూడా వాటివల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఎస్ఎంసీ సభ్యుల బృందం మండల స్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, డీసీఈబీ సెక్రటరీ కృష్ణకుమార్, పీఎంవో దేముడు బాబు, ఏపీవో అప్పలనాయుడు, రీసోర్స్ పర్సన్స్, అన్ని మండలాల నుంచి ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని చినముషిడివాడ కార్మికనగర్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారమే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..చినముషిడివాడలో కార్మికనగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన శాంతి నిలయం అపార్ట్‌మెంట్ ఐదో ఫ్లోర్‌లోని ఓ ఫ్లాట్ బాత్‌రూమ్‌లో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు 112 నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతుని వివరాలు ఆరా తీశారు.

రెంట్ బైక్‌పై వచ్చి..

సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతుని వివరాలు ఆరా తీయగా అతడిది హైదరాబాద్ న్యూబోయినగూడ ప్రాంతానికి చెందిన పీవీ శ్రీకాంత్(30)గా గుర్తించారు. హైదరాబాద్‌లోని టెక్ మహీంద్రలో ఉద్యోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఘటనపై మృతుని వద్ద ఉన్న ఆధారాల బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా మృతుడు శ్రీకాంత్.. తాను ఆత్మహత్య చేసుకుంటానని చెబుతూ కుటుంబ సభ్యులకు గురువారమే సెల్ఫీ వీడియో ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో శ్రీకాంత్ అదృశ్యమైనట్లు శనివారం ఉదయం హైదరాబాద్‌లో కేసు నమోదు అయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఓ యువతితో ప్రేమ వ్యవహారం బెడిసి కొట్టడంతో హైదరాబాద్ నుంచి ఇక్కడకు వచ్చి శ్రీకాంత్ ఆత్మహత్య పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులు ఇక్కడకు వస్తే పూర్తి సమాచారం తెలుస్తుందని సీఐ వెల్లడించారు.

చండీగఢ్‌పై విదర్భ విజయం

కెప్టెన్ల సెంచరీలు

విశాఖ స్పోర్ట్స్: విజయ్ హజారే ట్రోఫీ డి గ్రూప్‌లో భాగంగా శనివారం జరిగిన వన్డే మ్యాచ్‌లో చండీగఢ్‌పై విదర్భ విజయం సాధించింది. చండీగఢ్ నాలుగు వికెట్లకు 315 పరుగులతో లక్ష్యాన్ని నిర్దేశించగా విదర్భ మరో రెండు ఓవర్లుండగానే ఐదు వికెట్లు కోల్పోయి విజయతీరానికి చేరింది. ఇరుజట్ల కెప్టెన్లు సెంచరీలతో చేలరేగారు. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన చండీగఢ్ కెప్టెన్ మన్నన్ వోరా(101) ఓపెనర్‌గా సెంచరీతో గట్టి పునాది వేశాడు. మరో ఓపెనర్ తుషార్(25)తో కలిసి 73 పరుగులు, వన్‌డౌన్‌లో వచ్చిన శివమ్(44)తో కలిసి 118 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. కౌశిక్(59) అమిత్రలాల్(58) అర్ధసెంచరీలతో ఆజేయంగా నిలవడంతో నాలుగు వికెట్లకు 315 పరుగులు చేసింది. ఠాకూర్, భుటే, యష్ ఒకో వికెట్ తీశారు. ప్రతిగా విదర్భ కెప్టెన్ కరణ్ నాయర్ 163 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఓపెనర్ ధృవ్(57) అర్ధ సెంచరీ నమోదు చేశాడు. రాథోడ్ 27, యశ్ 19, శర్మ 13, వాఖేండ్ 17 పరుగులు చేశారు. దూబే 16 పరుగులతో నిలిచాడు. నిషాంక్ రెండు వికెట్లు తీయగా జగ్జీత్, సైనీ, అమ్రిత్ ఒకో వికెట్ తీశారు.

నేటితో ముగియనున్న డ్వాక్రా మేళా

దాబాగార్డెన్స్: ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సంజ ఉత్సవ్ ఎస్‌హెచ్‌జీ మేళా ఆదివారంతో ముగియనుందని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళా సంఘాలు, ప్రజలు పాల్గొని ఎస్‌హెచ్‌జీలకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

సీపీ శంఖబ్రత బాగ్చి



ఎస్ఐకి రివార్డు అందజేస్తున్న సీపీ బాగ్చి

అల్లిపురం: ప్రతి నెలా సిబ్బంది సేవలను గుర్తించి.. రివార్డులు అందజేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. డిసెంబర్లో 107 మంది సిబ్బంది సేవలను గుర్తించినట్లు వెల్లడించారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన క్రైం రివ్యూ మీటింగ్‌లో వీరికి రివార్డులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరాన్ని మరింత సురక్షిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట, పలు కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం, సాంకేతిక పరిజ్ఞానంతో పేరుమోసిన నిందితులను అరెస్ట్ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు చెందిన 107 మందిని సత్కరించారు. హోంగార్డు మొదలుకొని సీఐ వరకు రివార్డులు అందజేశారు.

సమర్థవంతమైన పోలీసింగ్‌కు సహాయ సహకారాలు



మాట్లాడుతున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విశాఖలో సమర్థవంతమైన పోలీసింగ్‌కు అవసరమైన సహాయ సహకారాలను అన్ని శాఖల నుంచి అందిస్తామని ఆయా శాఖల అధికారులు తెలిపారు. రెవెన్యూ, న్యాయ, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, నేవీ, ఇతర శాఖలతో కలిసి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పోలీసు అధికారులు మరింత సమర్థవంతంగా పోలీసింగ్ చేయడానికి అవసరమైన విధానాలను సీపీతో పాటు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎ.గిరిధర్, ఇతర శాఖల ఉన్నతాధికారులు తెలియజేశారు. ఆయా శాఖల నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఈ సమావేశంలో ఈ ఏడాది కాలంలో నగరంలో లా–ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్‌లపై ఆయా అధికారులతో సమీక్షించారు. ప్రతి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడుతూ ఈ సంవత్సరంలో వారి స్టేషన్ పరిధిలో చేసిన ఉత్తమ పోలీసింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే సంవత్సరంలో చేయాల్సిన, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.